సిలికానాంధ్ర నిర్వహించిన జానపద గీత రచన పోటీలో ద్వితీయ బహుమతి (రూ.5,000/-) పొందిన పాట

# అంపకాల పాట.

గోడా.విజయలక్ష్మి

ఈ పాట ఆడియో కోసం ఇక్కడ క్లిక్ చేయండి

ఏడు మల్లెల ఎత్తు మా ఆడపడచు
అల్లుడా జాగరత అలువనీ బోకు ||

(1) మా పంట చేలలో వరికంకు లే వంగి
వయ్యారి మేనిలో వంపులన్నీ నింపె
మా ఊరి ఏటిలో మా పిల్ల నేస్తాలు
చేప పిల్లలు తళుకు బెళుకులు నేర్పె

వన్నెలాడి పిల్ల మా ఆడపడచు
ఆ సోకులన్నీ నీకు కైవసం చేసెను. ||ఏడు||

(2) బంతిపూలచెండు మా పిల్ల సొగసు
అల్లుడా తలపైన ధరియించవయ్య
వెర్రి బాగుల శివుడివయిపోయి నీవు
ఒంటిలో సగమిచ్చి ఏలుకోవయ్య.

రోషమున్న పిల్ల మా ఆడపడచు
ఆ కంట గంగనూ కానరానీకయ్యా ||ఏడు||

(3) వెన్నవంటీ పిల్ల మా ఆడబడుచు
వెన్నెలంటీ మగడు నీవు కావాలయ్యా
నీ గుండె గడపలో కుడిపాదముంచి
నూరేళ్ళు నీ తోటి కాపురముండు

నా తల్లి! నా బిడ్డ! నా ఆడబడచా!
ఈవదినకే మాట రానీయకమ్మా
అత్తింట మెత్తగా ఒదిగిపోవమ్మా ||ఏడు||

Goda.Vijaya Lakshmi,
63-2-175B-2nd Floor,
Jawahar Nagar
Sriharipuram
Visakhapatnam.11
Ph.2762726.

